

(గత సంచిక తరువాయి)

"రెస్ట్‌రూంలోని ఓ వస్తువునా?"

"కాదు."

ఆమె మొహం తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుగా కనిపించింది. ఆద్య ఆమె సమాధానం కోసం ఆసక్తిగా చూసింది.

"నేను బాత్‌రూమ్ నా?" చివరకి అడిగింది.

"అవును" అంతా నవ్వుతూ చెప్పారు.

ఆ ఆటలో ప్రతీవారు తామేదో ఊహించే రౌండ్ సాగింది. చైత్రకి టర్కీ వచ్చింది. పక్షి అని తెలిసాక, 'పెంచుకునే పక్షా?' అని అడిగి కాదంటే 'తినే పక్షా?' అని అడిగింది. చికెన్‌ని కాదని తెలిసాక 'క్రిస్టమస్‌కి నన్ను తింటారా?' అనడిగి 'టర్కీ' అని తేలిగ్గా రెండో నిమిషంలో కనుక్కుంది.

"నాకొస్తే కనుక్కునేదాన్ని కాను. టర్కీని క్రిస్ట్‌మస్‌కి తింటారని కూడా నాకు తెలియదు" ఆద్య చెప్పింది.

"అమెరికాలో క్రిస్టమస్‌కి టర్కీలని వైట్‌హౌస్‌కి చాలామంది పంపుతారు. వాటిలో ఓ పక్షిని అధ్యక్షుడు క్షమిస్తాడు. దాంతో జీవితాంతం ఎవరూ తినకుండా సంరక్షించే ఆచారం ఉంది. ఆ వివరాలు తర్వాత చెప్తాను" చైత్ర చెల్లెలితో చెప్పింది.

కార్డ్స్‌లో ఇంకా కొండ, వేక్యూం క్లీనర్, పుస్తకం, లిఫ్‌స్టిక్, కేప్సికం మొదలైనవి వచ్చాయి. అంతా అందులో పాల్గొనే అవకాశం పూర్తయ్యాక పియర్ మరో కొత్త ఆటని ఆరంబించాడు. మరో బొత్తిలోని ఓ కార్డ్‌ని తీసి అడిగాడు.

"వరస్ట్ పర్సన్ టు బి స్టకప్ విత్ ఇన్ లిఫ్ట్."

"అర్థమైందిగా. లిఫ్ట్‌లో ఎవరితో నువ్వు చిక్కుపడకూడదో చెప్పాలి" చైత్ర గొంతు తగ్గించి ఆద్యకి తెలుగులో చెప్పింది.

అందరి జవాబులు నవ్వు తెప్పించాయి.

"వెల్లుల్లి తిన్నవాడు."

"ముప్పై ఆరుగంటలుగా ఆగకుండా ప్రయాణించినవాడు" అలెక్సీ ముక్కు మూసుకుని చెప్పాడు.

"అల్ అసాద్" ఆద్య చెప్పింది.

"గుడ్ ఒన్" క్రిస్ థమ్స్ అప్ గుర్తుని చూపించి చెప్పాడు.

"తన కొత్త భర్తతో నా మాజీ భార్య."

ఆ జవాబుకి చాలామంది ఫక్కున నవ్వారు.

"మా అత్తగారు."

"నాకు పెట్టకుండా పొటాటో చిప్స్ తినేవాడు."

"మేనీటర్."

అంతా చెప్పాక పియర్ మరో కార్డ్‌లోది బయటకి చదివాడు.

"నీ జీవితంలోంచి ఇతరులు నేర్చుకోదగ్గ పెద్ద పాఠాన్ని ఒకటి చెప్పండి. ఆద్య. ముందుగా నువ్వు చెప్పు."

కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పింది.

"అక్కడే ఆగక. క్లైసిస్‌లో అక్కడే ఆగక. ఆనందంలో, అభివృద్ధిలో కూడా అక్కడే ఆగక. కదులు. పాకు. కుంటు. నడు. పరిగెత్తు. పడు. కాని లే. అక్కడే ఆగక. ఆగడం ఆత్మహత్యలాంటిది. వెనక్కి తిరగాల్సిన మంచి చోటు డెడ్ ఎండ్" ఆద్య మాటల్లో స్వల్పంగా ఉద్విగ్నతని చైత్ర గుర్తించింది.

"అది జీవనకళ!" ఖాలెద్ చెప్పాడు.

మరికొంతమంది చెప్పాక ఇంకో ఆటకి వెళ్ళబోయేముందు పియర్ ఆఖరి ప్రశ్నని అడిగాడు.

"నువ్వు దేవుడిని ఎందుకు నమ్ముతావు? లేదా ఎందుకు నమ్మవు?"

ఒక్కొక్కరూ ఒకో జవాబు చెప్పారు.

"టు ప్లే సేఫ్. ఉన్నాడో, లేదో కాని ఉన్నాడని నమ్మితే మంచిదని. లేదా నరకానికి పంపుతాడని."

"నమ్మడమనేది సంప్రదాయంగా పెద్దలనించి ఆస్థిలా రాబట్టి."

"ఉన్నాడని నా మనసు బాగా విశ్వసిస్తోంది కాబట్టి."

"నమ్మకపోతే ఆదివారం ఉదయం చర్చ్‌కి బదులు వెళ్ళడానికి మరో చోటేది?"

"నమ్మను. ఎందుకో నేను సుదీర్ఘమైన జవాబు చెప్పనా?" అలెక్సీ అడిగాడు.

"చెప్పు. కమ్యూనిస్ట్ అభిప్రాయం తెలుసుకోవాలని నాకుంది" ఇఫియాని వాగ్‌బోగు కోరాడు.

"బోర్ కొడితే స్టాప్ అంటే ఆపేసే పక్షంలో ఆరంభిస్తాను. ఈ విశ్వం వయసు వందల కోట్ల సంవత్సరాలు. అందులో భూమి వయసు నాలుగు వందల కోట్ల సంవత్సరాలు. దానిమీద మానవ ఆవిర్భావం జరిగి రెండు లక్షల సంవత్సరాలైంది. వారిలో దైవభావన పుట్టి పదివేల సంవత్సరాలే అయింది. హిందూమతం వయసెంతో తెలియదు. కాని

వేల సంవత్సరాలు, జూడాయిజం, జొరాస్ట్రియన్ మతాల వయసు నాలుగువేల సంవత్సరాలు. బౌద్ధం రెండువేల ఆరువందలు, కంఫూషియస్ రెండున్నర వేల సంవత్సరాలు, టావోయిజం రెండువేల నాలుగు వందల సంవత్సరాలు, క్రైస్తవం రెండువేల ఏళ్ళు, ఇస్లాం పన్నెండు వందల సంవత్సరాలు, సిక్కుమతం నాలుగువందల సంవత్సరాలు. ఆ తర్వాత కూడా కొన్ని చిన్న మతాలు పుట్టాయి. అంటే మనిషి పుట్టాకే, అతని ఆలోచనల్లోంచే దైవం పుట్టాడు."

అలెక్సీ చెప్పేది అంతా ఆసక్తిగా వింటున్నారు.

"మనిషితోపాటే దైవం కూడా ఎదిగాడు. మనిషి చెట్లకింద నివశించినప్పుడు చెట్లు, చెట్ల కింద రాళ్ళే దేవతలు. మనిషి గుహల్లోకి మారాక దేవుడు కూడా అందులోకి మారాడు. తర్వాత మనిషి గుడిసెలోకి మారాక దేవుడికి కూడా ప్రత్యేకంగా ఓ గుడిసెని నిర్మించాడు. మనిషి శిల్పకళని నేర్చాక కళాత్మక ఆలయాలని నిర్మించి అందులో దేవుడి విగ్రహప్రతిష్ఠ చేసాడు. సిమెంట్‌తో, కాంక్రీట్ నిర్మాణాలని ఆరంభించాక దేవుడికీ వాటితోనే ఆలయాలని ఏర్పరిచాడు.

"మనిషి ఆకులని కప్పుకున్నప్పుడు దేవుడికీ ఆకుల్ని కప్పాడు. తను నూలు వస్త్రం తయారీ నేర్చుకున్నాక దేవుడికీ వస్త్రాన్ని నేసాడు. పట్టునించి బట్ట నేయడం నేర్చుకున్నాక దేవుడి విగ్రహాలకి పట్టుబట్టలని చుడుతున్నాడు. తను చమురు దీపం పెట్టుకోవడం ఆరంభించాక దేవుడి గుళ్ళో కూడా చమురుదీపం పెట్టాడు. తను ఎలక్ట్రిక్ దీపం కనుక్కున్నాక దేవుడి గుళ్ళో కూడా ఎలక్ట్రిక్ దీపాన్ని పెట్టాడు. తను రోజూ స్నానం చేస్తాడు. కాబట్టి దేవుడికీ స్నానం చేయిస్తున్నాడు. తను తింటాడు కాబట్టి దేవుడికీ నైవేద్యం పెడుతున్నాడు. మనిషి కనిపెట్టిన ఆయుధాలు దైవాయుధాలయ్యాయి. ఇలా దేవుడు కూడా మనిషి ఆటవిక దశనించి మనిషివెంటే పరిణామం చెందుతూ, ఆ నాగరికతకి అనుగుణంగా మనతో ప్రయాణిస్తూ వస్తున్నాడు. దేవుడు ఇంతదాకా ఎవరికీ కనపడి తను ఉన్నాడని చెప్పలేదు."

ఎవరూ స్టాప్ చెప్పలేదు. ఆసక్తిగా వింటున్నారు.

"అసలు మనిషికి ఈ దైవీభావం ఎలా తట్టింది? ప్రకృతి దుర్ఘటనలకి భయపడటంలోంచి మనుషుల్లో దైవీభావం మొగ్గ తొడిగింది. వాటిని సృష్టించేది దేవుడని, ఆయన్ని ఆరాధిస్తే వాటినించి కాపాడతాడని నా ఉద్దేశం. నిస్సహాయుడైన మనిషికి ఓ ఆలంబన అవసరమైంది. ఈ రోజుకీ ఆపదలోని వారికే దేవుడు గుర్తురావడానికి ఇదే కారణం. మనుషులు లేని కేవలం పశుపక్ష్యాదులు ఉన్న చోట దేవుడు లేడు. అక్కడ విగ్రహాలు, ప్రార్థనాస్థలాలు లేవు. దేవుడ్ని ఆరాధించే అనేక పద్ధతులని మనిషే కనిపెట్టాడు తప్ప దేవుడినించి ఆ సూచనలేం రాలేదు. మొదట్లో ప్రకృతినే దేవుడిగా ఆరాధించారు. క్రమంగా దేవుడికో రూపాన్ని కల్పించారు. ఇతిహాసాలని రాసారు. రెండు రోజుల క్రితమే చదివాను. ఇండియాలో మహారాష్ట్ర రాష్ట్రంలోని ఉపల గ్రామస్థులు ఆవులని పూజించినట్లుగానే స్థానిక కోతులని కూడా పూజిస్తారు. వాటి పేర ఆస్థులని కూడా రిజిస్టర్ చేస్తారు. ఇలా దేవుడ్ని ఆరాధించేది, ఆయనపేర ఇతర మనుషులని ద్వేషించేది, విమర్శించేది, మెచ్చుకునేది, చంపుకునేది, చంపించేది మనిషే. దేవుడు ఎన్నడూ మనిషి విషయంలో కల్పించుకోలేదు. కాబట్టి

హేతువాదంతో ఆలోచించే నాకు దేవుడు లేడు. నేను నాస్తికుడ్ని. దేవుడు అప్రయోజకుడని నా అభిప్రాయం. మతం కొందరిని ఆవుని తిననివ్వదు. కొందరిని పందిని తిననివ్వదు. అదే జంతువైనా మాంసం మాసమే అవుతుంది. ఈ భేదం ఎన్ని లక్షలమందిని చంపిందో!"

"ఇంట్రెస్టింగ్. అండ్ అన్‌డిబేటబుల్" లివియూ హుతోషి చెప్పాడు.

వెంటనే బ్రెజిలియన్ సిమోనే రెన్నో చెప్పాడు.

"ఐ బెగ్ టు డిఫర్ విత్ యు అలెక్సీ. దేవుడు ఉంటే మానవాళికి కొంత లాభం వుంది. ఓ ప్రొఫెసర్ ఫిజీ ఐలాండ్స్‌కి వెళ్ళాడు. నాస్తికుడైన అతను, తనని భోజనానికి ఆహ్వానించిన, వయసు మళ్ళిన ఓ తెగనాయకుడికి చెప్పాడు. 'నువ్వు ఫారిన్ మిషనరీల మాట వింటున్నావు. క్రిస్టియన్ మతంలో చేర్చుకోబడ్డవారి ద్వారా వారు ధనం సంపాదిస్తారని తెలుసా? మనుషుల పాపాలని తను తీసుకుని, పరిహారంగా క్రీస్తు శిలువమీద మరణించడం అవాస్తవం. దాన్ని నమ్మడం నీ మూర్ఖత్వం' ఆ చీఫ్ చిన్నగా నవ్వి తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

'నీ పక్కన ఉన్న ఆ రాతిని చూడు. మేం దాంతో మాకు చిక్కిన మనుషుల తలలని పగలకొట్టి, వారిని నిప్పుమీద కాల్చుకుని తినేవాళ్ళం. జీసస్ బోధించిన క్షమ, ప్రేమలని మిషనరీలు మాకు బోధించి ఉండకపోతే నువ్వీ రాత్రి మాతో కలిసి భోజనం చేసే బదులు మేం ఆ రాతిని ఉపయోగించి నిన్ను భోజనం చేసేవాళ్ళం. బైబిల్ లేకపోతే నువ్వు మాకు భోజనమై ఈ ప్రదేశంనుంచి ప్రాణాలతో వెళ్ళేవాడివి కావు."

"నేను, అలెక్సీ పేర్కొన్న జంతువుల విషయంలో ఓ వివరణ ఇస్తాను. భర్తైనా, అన్నైనా, తండ్రైనా, కొడుకైనా, బాబాయైనా మగాడు మగాడే కదా? కాని వీరందరితో వేరువేరుగా ప్రవర్తిస్తారు. ఎందుకు? సంతానం కోసం భర్తతో ప్రవర్తించినట్లు మిగిలిన మగాళ్ళతో కూడా ఎందుకు ప్రవర్తించడంలేదు. అలాగే ఆవుపాలని వినియోగిస్తారు కాని కుక్క, గాడిద పాలని ఎందుకు వినియోగించం? అవీ జంతువులు ఇచ్చే పాలేకదా? ఇక్కడ విషయం మాంసానికి సంబంధించిది కాదు. మనోభావాలకి సంబంధించింది. ఏ జంతువనే ఎంపిక ఉంది. ఆవు విశిష్ఠత పిల్లి, కుక్క, గాడిదలకి లేదు. అవీ జంతువులే అని వాటి పాలని తాగుతామా? మతమనేది మనోభావంలోంచే పుట్టి దానిమీదే ఆధారపడుతోంది. నాకు పంది గురించి తెలీదు. హిందువు మాత్రం తనకి ఆహారాన్నిచ్చి పోషించే ముఖ్యమైన రెంటిని మాతగా చూస్తాడు. పంట పొలాలకి నీళ్ళనిచ్చే నదిని, పాలని ఇచ్చే ఆవుని,. గంగామా అంటారు. మా అంటే మదర్. మరో నదిని కృష్ణమ్మ అంటారు. అమ్మ అంటే మదర్ అని అర్ధం. గోదావరి తల్లి అంటారు. తల్లి అంటే మదర్ అని అర్ధం. అలాగే గోమాత అంటారు. తల్లికి ఇచ్చే గౌరవాన్ని ఆవుకి ఇవ్వడం మనోభావానికి చెందింది. ఈ మనోభావాల స్వేచ్ఛ ఉంటే జంతువులకి కూడా దేవుడు ఉండేవాడేమో?" చైత్ర చెప్పింది.

అలెక్సీ కొనసాగించాడు.

"ఒప్పుకున్నాను. చాలాకాలంగా నాకున్న ఆలోచనని చెప్తాను. దేవుడికి మనుషులమీద ప్రేమ ఉన్నట్లుగా ప్రతీ మతం బోధిస్తుంది. దాంతో నేను ఏకీభవించను. మానసిక బాధ స్వయంకృతం. మనసుని కంట్రోల్ చేసుకునే శక్తి, కౌన్సిలింగ్ ద్వారా పోగొట్టుకునే శక్తి మనిషికి ఉన్నాయి. ఓదార్పు మాటలు, సెల్ఫ్ కౌన్సిలింగ్‌లాంటి వాటితో ఆ బాధని మరవచ్చు. నిజానికి అన్నిటికీ, అంతా సమానంగా మనసులో బాధపడరు. భార్యపోతే ఒకడు బాధతో విలవిల్లాడతాడు. ఇంకొకడు ఉదాసీనంగా ఉంటాడు. కాని శారీరక బాధ మాత్రం అందరికీ పూర్తిగా సమానం. కేన్సర్ రోగుల బాధ గురించేకాదు నేను చెప్పేది. బలవంతంగా రహస్యాలు చెప్పించడానికి పెట్టే చిత్రహింసలు భరించే ఎవడూ, యుద్ధరంగంలో తీవ్రంగా గాయపడి స్పృహలో ఉండి, భరించలేని శారీరక బాధతో విలవిల్లాడేవాడు లేదా కారు ప్రమాదంలో కాలు విరిగి విలవిల్లాడేవాడు మానసిక బాధలా తన శారీరక బాధని కంట్రోల్ చేసుకోలేడు. ఎవరూ కౌన్సిలింగ్ ద్వారా, ఓదార్పు మాటలద్వారా మానసిక బాధలా దాన్ని తగ్గించలేరు. ఆ శారీరక బాధని అనుభవించేవారు దేవుడ్ని ప్రార్థిస్తే 'వెంటనే చంపేయ్' అని మాత్రమే ప్రార్థిస్తారని నా నమ్మకం. అలాంటి శారీరక బాధని ఇచ్చిన దేవుడికి మనిషిమీద ప్రేమ ఉందని ఎలా నమ్మమంటారు?"

"అగైన్ అన్‌డిబేటబుల్" హుతోషి చెప్పాడు.

"ఎక్కడో చదివాను. వృద్ధాప్య భయాల్లో ఒకటి రోగ భయమట. మా నాన్న అనేవారు. నాకు చచ్చిపోతాననే భయం లేదు. కాని మరణ బాధంటేనే భయమని. రోగబాధని దేవుడు ఎందుకు ఇచ్చాడో నాకు అర్థంకాదు. శరీరంలో ఫలానా భాగం అస్వస్థతకి గురైందని సూచించడానికని చదివాను. కాని దాన్నంత తీవ్రంగా సూచించాలా? అన్నది నా ప్రశ్న" ఇలియా చెప్పింది.

"కొత్తకోణంలోంచి ఆలోచించే మార్గం ఇది. థాంక్స్ అలెక్సీ" చైత్ర చెప్పింది.

"దట్సిట్. తర్వాతి ఆటేమిటి?" అలెక్సీ తను చెప్పాల్సింది ముగించినట్లుగా అడిగాడు.

"వర్డ్ గేమ్. నేను చూపించే పదం గురించిన ఓ విశేషం కూడా చెప్పాలి" పియర్ చెప్పాడు.

అది కొత్త సమాచారం ఆసక్తిగా తెలుసుకునే ఆట. తనో కొత్త ఆట ముక్కలున్న పెట్టెని తీసి చెప్పాడు.

"ఈ ఆటలో ప్రతీవారు పది పాయింట్స్ క్రెడిట్‌తో స్టార్ట్ అవుతారు. నేను అడిగే ప్రశ్నకి జవాబుని ఐదు క్షణాల్లో ఆన్సర్ ఆరంభించకపోతే ఓ పాయింట్ మైనస్ అవుతుంది. ఎవరు ముందుగా జీరో పాయింట్‌కి వస్తారో వారు ఓడిపోయినట్లు. లెఫ్ట్ టు రైట్ ఒకరి తర్వాత మరొకరు ఆన్సర్ చెయ్యాలి. టు స్టార్ట్ విత్ యు. రెడీ మిస్ గాడా బార్బూర్?" అడిగాడు.

"రెడీ" ఆమె జవాబు చెప్పింది.

అతనో కార్డ్ తీసి అందరికీ కనపడేలా పట్టుకున్నాడు. మొనాకో అన్న పదం నల్ల అక్షరాల్లో కనిపించింది.

"మొనాకో. రాజధాని మాంటికార్లో. ఆ దేశం విస్తీర్ణం రెండు చతురస్ర కిలోమీటర్లే. మొనాకో గ్రాండ్ ప్రిక్స్ కార్ల రేసులకి ప్రసిద్ధి. ప్రతీ ఆరుగురిలో ఒక్కరే స్థానికులు. మిగిలిన వారు విదేశస్థులు."

"ఒక పాయింట్ చాలు."

తర్వాతి కార్డ్‌లో 'ప్రింగిల్ చిప్స్' అని ఉంది.

"ప్రింగిల్ చిప్స్. ఇవి ప్రపంచవ్యాప్తంగా నూట నలభై దేశాల్లో వందరకాల రుచుల్లో అమ్ముడవుతున్నాయి."

తర్వాతి కార్డ్ వెస్టిండీస్.

"ఈ పేరుకి కారణం కొలంబస్ దీన్ని ఈస్ట్‌లో ఉన్న ఇండియాగా భావించాడు. పొరపాటు తెలిసాక దానికి వెస్ట్ ఇండీస్ అనే పేరు పెట్టారు."

"చికాగో. రెడ్ ఇండియన్స్ వెల్లుల్లిని చికాగవా అని పిలిచేవారు. ఆ పదంలోంచి చికాగో నగరానికి ఆ పేరు వచ్చింది."

"ఈజిప్ట్. పిరమిడ్స్ నిర్మాణ కూలీలకి ముల్లంగిని జీతంగా ఇచ్చేవారు."

"సింగపూర్. సింగపూర్ లోని వృద్ధ పాదచారులు ట్రాఫిక్ లైట్స్ వాక్ బటన్‌మీద తమ కన్సెషన్ కార్డ్‌ని టాప్ చేస్తే రోడ్ దాటడానికి పదమూడు క్షణాల ఎక్కువ సమయం లభిస్తుంది."

"సౌత్ కొరియా. ఫీమేల్ గోల్ఫర్స్ సౌత్ కొరియాలో ఎక్కువ."

"ఇండియా. ప్రపంచంలోని ఇరవై రెండు శాతం పాలు ఇండియాలోనే ఉత్పత్తి అవుతాయి."

"జపాన్. అక్కడ సగటున ప్రతీ ఇరవై మూడుమందికి ఓ వెండింగ్ మెషీన్ ఉంది. అవి చలికాలంలో వేడి డ్రింక్స్, వేసవిలో చల్లటి పానీయాలని అమ్ముతాయి."

"ఫోర్ కార్నర్స్ మాన్యుమెంట్. అమెరికాలో నాలుగు రాష్ట్రాలని ఏకకాలంలో చూసే చోటది. అక్కడనించి ఊటా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలని చూడచ్చు. నేను ఆ ప్లేస్‌కి వెళ్ళాను."

"చైనా. ప్రపంచంలో టీని అధికంగా తాగే దేశం చైనా."

"తప్పు. చైనా కాదు. బ్రిటన్. టీ ఉత్పత్తిలో చైనా నంబర్ ఒన్."

కేవలం సమాచారం మాత్రమే కాబట్టి ఆ ఆట ఆద్యకి ఆసక్తిగా అనిపించలేదు.

"చివరగా స్కేటర్‌గోరీస్ ఆడదాం. మీ అందరికీ ఈ ఆట నియమాలు తెలుసు. కాని ఆద్యకి తెలీదు కాబట్టి ఆమెకోసం. ఇది క్రియేటివ్ థింకింగ్ ఆట. ఇది పదాలని గుర్తుతెచ్చుకునేందుకు తోడ్పడి, మెంటల్ కెపాసిటీని పెంచుతుంది. ఈ ఆటలో అనేక కేటగిరీలు ఉంటాయి. ఉదహరణకి సెలర్బిటీస్, థింగ్స్ ఇన్ ది కిచెన్, అవుట్‌డోర్ ఏక్టివిటీస్, సిటీస్ ఇలా. నేను ఓ కేటగిరీని చెప్పి, ట్వంటీ సైడెడ్ పాచికని వేస్తాను. దానిమీది ఏ అక్షరం పడుతుందో ఆ

అక్షరంతో ఆరంభమయ్యే ఆ కేటగిరీకి చెందిన పదం మీ దగ్గరున్న కాగితంలో రాయాలి. జవాబులు రాయడానికి ప్రతీ కేటగిరీకీ మూడు నిమిషాలు మాత్రమే వ్యవధి. ఎగ్ సేండ్ టైమర్‌ని వాడతాను. ఈలోగా అంతా రాస్తే తర్వాతి ప్రశ్నని అడుగుతాను. క్లియర్?"

"క్లియర్" ఆద్య జవాబు చెప్పింది.

అతను అందరికీ పెన్సిల్స్, ఆ ఆటతోపాటు రాయడానికి వచ్చిన ప్రింటెడ్ కాగితాలని ఇచ్చాడు.

"గుడ్. మీరు గెలవడానికి నా దగ్గరున్న పన్నెండు సరైన జవాబులు రాయాలి. పదాలముందు 'ఏ ఏన్ ది'లు పనికిరావు. మీరు రాసింది నా జవాబుతో సరిపోకపోతే, మీరు కాంటెస్ట్ చేయచ్చు. అప్పుడు మిగిలిన ఆటగాళ్ళల్లో ఎందరు మీకు థంప్స్‌అప్ చూపిస్తారన్న దానిమీద మీ జవాబు అంగీకారమా? కాదా? అన్నది నిర్ణయిస్తాను. ఒకే జవాబుని ఇంకో ప్రశ్నకి జవాబుగా వాడకూడదు. ఉదాహరణకి జార్జ్ బుష్‌ని మళ్ళీ వాడకూడదు. కాని బుష్ జార్జ్ అని చివరి పేరుని ముందుకు తెచ్చి వాడచ్చు. ఇలా మొత్తం పన్నెండు కేటగిరీలకి పన్నెండు జవాబులతో ఆట ముగుస్తుంది. ఎవరు ఎక్కువ సరైన జవాబులు రాస్తే వాళ్ళు గెలిచినట్లు. అన్నిటికన్నా ముఖ్యంగా ఇతరులు రాసిన జవాబునే మీరూ రాస్తే మీ ఇద్దరికీ పాయింట్స్ ఉండవు. క్లియర్?" పియర్ అడిగాడు.

"ఇంకొకరు నేను రాసిన జవాబే రాసారని నాకెలా తెలుస్తుంది?" ఆద్య అడిగింది.

"రాస్తున్నప్పుడు తెలీదు. జవాబులు పైకి చదివాకే తెలుస్తుంది. కాని ఆలోచించి రాస్తే అలా జరక్కపోవచ్చు. ఉదాహరణకి నువ్వు ఓ ఊరు పేరు రాయాలనుకుంటే బాంబే రాయకు. దాని పాపురాలిటీని బట్టి అది ప్రతీవారికీ తట్టే జవాబు. నీలా ఇండియానించి వచ్చిన మీ అక్క కూడా ఈ ఆటలో పాల్గొంటోంది కాబట్టి ఆమె అది కూడా రాయచ్చని గెస్ చేసి, అదే అక్షరంతో ఆరంభమయ్యే ఇంకో ఊరిపేరు రాయాలి. ఇతరులని దృష్టిలో ఉంచుకుని నీ జవాబులు ఉండాలి. అందుకే దీన్ని క్రియేటివ్ థింకింగ్ ఆట అన్నాను."

"అర్థమైంది" ఆద్య చెప్పింది.

పియర్ పాచికని వేస్తే సి అక్షరం పడింది.

"సి కేటగిరీ సిటీస్. పన్నెండు జవాబులు రాయాలి" చెప్పాడు.

అందరి పెన్సిల్స్ చకచక కదులుతున్నాయి. ఆద్య ఆలోచించసాగింది. సియాటెల్, న్యూయార్క్, హైద్రాబాద్, టోక్యో, ఆడిస్ అబాబా, ఆక్రా, టకరోడి, దుబాయ్, ఢిల్లీ, కలకత్తా, లండన్, పేరిస్‌లని మొదటి కాలంలోని పన్నెండు గీతలమీదా రాసింది.

ఇతరులు తమ జవాబులని చదివినప్పుడు లండన్, పేరిస్, న్యూయార్క్, టోక్యోలు మరికొందరు రాయడంతో వాటిని కొట్టేయాల్సి వచ్చింది.

"ఇది ప్రధానంగా మైండ్ గేమ్. ఇతరులకి ఏం తెలుసన్నది నీకు తెలుసో అది ఇక్కడ ఉపయోగించాలి. నువ్వు హైద్రాబాద్ రాస్తావని నాకు తెలుసు కాబట్టి అది రాయలేదు. వీళ్ళెవరూ రాయరని పూనా, మద్రాస్, లక్నోవంటి అన్నీ ఇండియన్ సిటీలే రాసాను. మన పక్కవారు ఏం రాయచ్చో గెస్ చేసి వాటిని వదిలేయాలి" చైత్ర చెల్లెలికి ఆట ముగిసాక సూచించింది.

మరో నాలుగు కేటగిరీలు ఆడాక బ్రైజిల్‌కి చెందిన సిమోనే రెన్నో, రష్యాకి, చెందిన అలెక్సీ, పెరూకి చెందిన మిస్ క్రిస్టీనా లోపెజ్‌లకి మొదటి మూడుస్థానాలు వచ్చాయి.

"ఆఖరిది పిక్చర్ గేమ్."

అతను అది ప్రకటించగానే చాలామంది బయటకి పెద్దగా నవ్వారు. లేచి అంతా ఓ బల్లముందు క్యూలో నిలబడ్డారు. క్రిస్‌స్మిత్ ఆ బల్లమీద నిమ్మకాయ ముక్కలని ఉంచి చెప్పాడు.

"ఆద్యా! నీకు చూపించే బొమ్మలని బట్టి అదేం దేశమో ఇరవై క్షణాల్లో చెప్పాలి. చెప్పలేనివారు ఆ నిమ్మకాయ ముక్కని తిని, ఈ చెత్తడబ్బాలో దాన్ని పడేసి తిరిగి వెళ్ళి క్యూలో నిలబడాలి. ఈ నిమ్మకాయ ముక్కలన్నీ అయిపొయ్యేదాకా ఈ ఆట సాగుతుంది."

"వీడియోని తర్వాత మెయిల్ చేస్తాడు" దాని ఎదురుగా ఉంచిన వీడియోని ఆన్ చేసిన క్రిస్ మొబైల్‌ని చూపించింది.

బల్లమీద ఉంచిన లేప్టాప్‌లో బొమ్మలని చూపించసాగాడు. మొదటగా బెల్+జిమ్ బొమ్మలు కనిపించాయి.

"బెల్..జి...బెల్జియం" ఖాలెద్ చెప్పాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments